సరస్వతీమాత అలంకరణలో..

దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నవరాత్రుల్లో భాగంగా ఐదో రోజు సోమవారం అమ్మవారిని సరస్వతీమాతగా అలంకరించారు. నిర్వాహకులు, భక్తులు అమ్మవారి ఆలయాలు, మండపాలకు చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మండపాల వద్ద బతుకమ్మ సంబురాలు జరుపుకొన్నారు. మహిళలు, యువతులు కోలాటం వేసి ఆడిపాడారు.

– నెట్‌వర్క్ నమస్తే తెలంగాణ, అక్టోబర్ 7

పాలమూరు: వనదుర్గాదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి మాత

ఊట్కూర్ భవానీ మందిరంలో సరస్వతీదేవి అలంకరణ

పేట: మహాచండీ అలంకరణలో చౌడేశ్వరీమాత

పేట: మావూళమ్మదేవి అలంకరణలో మల్లాంబికాదేవి

కోటకొండలో వనదుర్గాదేవిగా కన్యాకపరమేశ్వరీ మాత

అమిస్తాపూర్‌లో పార్వతీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

వేములలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ

అడ్డాకులలో తిరుపతిరెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి సింగిరెడ్డి

మూసాపేట, అక్టోబర్ 7: మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సోమవారం అడ్డాకులలో బాధిత కుటుంబాలను పరామర్శించారు. అడ్డాకుల గ్రామానికి చెందిన మాజీ రైతుబంధు మండలాధ్యక్షుడు తిరుపతిరెడ్డి తల్లి మృతిచెందిన విషయం తెలిసి కుటుంబ సభ్యులను ఇంటిళ్లి పరామర్శించారు. అదేవిధంగా అదేగ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు సత్యనారాయణరెడ్డి మృతిపై ఆయన ఇంటికివెళ్లి సీనియర్ నాయకులు చంద్ర మోహన్‌రెడ్డి, సూర్యమోహన్‌రెడ్డి తోపాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ మంత్రి వెంట అడ్డాకుల సింగిల్‌విండో చైర్మన్ జితేందర్‌రెడ్డి, పెద్దమందడి మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, మాజీ ఎంపీటీసీ రంగన్న గౌడ్ ఆంజనేయులు, కృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మత్స్యకారులు ఆరోగ్య బీమా చేసుకోవాలి

● ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ● హేమసముద్రంలో చేపపిల్లల విడుదల

చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే యెన్నం, కలెక్టర్ విజయేందిర బోయి

హన్వాడ, అక్టోబర్ 7: ప్రతిఒక్క మత్స్యకారుడు ఆరోగ్య బీమా చేసుకోవాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఇబ్రహీంబాద్ హేమసముద్రం చెరువులో ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన చేప పిల్లలను కలెక్టర్ విజయేందిర బోయితో కలిసి వదిలారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న హేమసముద్రం చెరువు మరింత పెంచి ఎక్కువ నీరు నిల్వ ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామన్నారు. మండలంలోని ప్రతి చెరువు ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఎండీ రాధారోహిణి సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, గ్రంథాలయం సంస్థ చైర్మన్ నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మహేందర్, తాసీల్దార్ కిష్ట్యానాయక్, మాజీ ఎంపీటీసీ అంజన్న, గ్రామ అధ్యక్షుడు వెంకట్రాములు పాల్గొన్నారు.

రుణమాఫీ కాని రైతుల కోసం ప్రత్యేకడ్రైవ్

ఆర్‌యూబీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

● జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, అక్టోబర్ 2: నియోజకవర్గంలో అర్హులైన ప్రతిరైతులకు రుణమాఫీ చేయడానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. సోమవారం జడ్చర్లలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హత కలిగిన ప్రతి రైతుకు రుణమాఫీ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు 26,662మంది రైతులకు రూ.207కోట్ల రుణమాఫీ చేసినట్లు పేర్కొన్నారు. రుణమాఫీ కోసం వ్యవసాయాధికారులు చేయాల్సిన ఫ్యామిలీ మ్యాపింగ్ ప్రక్రియ మొత్తం రూ.5వేల కుటుంబాలకు ఇప్పటివరకు 3వేల కుటుంబాలకు మాత్రమే చేశారన్నారు. ఇంకా 2వేల కుటుంబాల మ్యాపింగ్ చేయాల్సి ఉందన్నారు. ఫ్యామిలీ మ్యాపింగ్‌ను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే తెలిపారు. రూ.2లక్షలకు పైగా రుణాలు కలిగిన రైతులు మొత్తాన్ని బ్యాంకులకు చెల్లిస్తే వాటిలో రూ.2లక్షల రుణాన్ని ప్రభుత్వం మాఫీ చేస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారన్నారు. అందుకే రైతులు రూ.2 లక్షలకు పైన ఉన్న డబ్బులను చెల్లిస్తే రూ.2లక్షల రుణమాఫీ విడుతల వారీగా మాఫీ చేయించే బాధ్యత తన దేనని స్పష్టం చేశారు. ఈనెల 8వ తేదీనుంచి 10రోజుల పాటు అధికారులు గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వివరాలు సేకరించాలని అధికారులకు సూచించారు. ఇందుకు గ్రామాల్లో చాటింపు వేయించాలని తెలిపారు. రైతుల సంఖ్య స్పష్టత వస్తే ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో మాట్లాడి ప్రతిఒక్కరికీ రుణమాఫీ అయ్యేలా చూస్తానన్నారు. సమావేశంలో ఏడీఏ ఆంజనేయులు, ఏవోలు గోపీనాథ్, నరేందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

నవంబర్‌లో ఆర్‌యూబీ ప్రారంభం

జడ్చర్ల మున్సిపాలిటీ గాంధీచౌక్ సమీపంలోని రైల్వే అండర్ బ్రిడ్జిని నవంబర్ మొదటివారంలో ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తెలిపారు. సోమవారం రైల్వే రీజినల్ మేనేజర్ మూర్తి, ఏజీఎం శ్రీనివాస్‌తో కలసి రైల్వే అండర్ బ్రిడ్జిని పరిశీలించారు. అండర్ బ్రిడ్జిలో నుంచి వర్షపునీరు వెళ్లడానికి ప్రత్యేకంగా డ్రైనేజీ ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఎక్కడా నీళ్లు నిల్వ ఉండకుండా బయటకు వెళ్తాయన్నారు.

గదుల నిర్మాణానికి శంకుస్థాపన

జడ్చర్లలోని కో-ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలలో అదనపు గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ సారిక, మాజీ మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, రామ్మోహన్, మీన్హాజ్, గంగ్యానాయక్, కృష్ణయ్య, కౌన్సిలర్ చైతన్య, సుజాత ఉన్నారు.

కొత్త శ్రీనివాస్‌గుప్తా జన్మదిన వేడుకలు

మక్తల్, అక్టోబర్ 7: బీఆర్ఎస్ మక్తల్ సీనియర్ నాయకుడు కొత్త శ్రీనివాస్‌గుప్తా జన్మదినం సందర్భంగా ఆయన నివాసంలో స్థానిక నాయకులు కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మక్తల్, మాగనూర్ మండలాల అధ్యక్షులు మైపాల్‌రెడ్డి, ఎల్లారెడ్డి, పట్టణ అధ్యక్షుడు చిన్నహనుమంతు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

గోడు విని గోస తీర్చండి!

● కలెక్టరేట్ ప్రజావాణికి పోటెత్తిన ఫిర్యాదుదారులు ● అధికారులతో ఫిర్యాదుదారుల మొర

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, అక్టోబర్ 7: గోడు విని గోస తీర్చండంటూ పాలమూరు ప్రజలు అధికారులను వేడుకున్నారు. సోమవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి జనం పోటెత్తారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి కలెక్టర్ విజయేందిర బోయి అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మోహన్‌రావు, జిల్లా అధికారులు అర్జీలు స్వీకరించి పరిష్కారానికి సంబంధిత అధికారులకు నివేదించారు.

జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ విజయేందిరబోయి

గ్రామాల్లో టాంటాం వేయించాలి

మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంపై గ్రామాల్లో టాంటాం వేయించాలని కలెక్టర్ విజయేందిర బోయి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి జిల్లా, మండల ప్రజావాణిపై సమీక్షించారు. మండల పర్యవేక్షక అధికారులు మండల ప్రజావాణిపై తప్పకుండా సమీక్షించాలన్నారు. వరదల సందర్భంగా మంజూరు చేసిన పనులు సత్వరం పూర్తిచేసి వినియోగితా పత్రాలు సమర్పించాలని ఆర్‌అండ్‌బీ, పీఆర్, మిషన్ భగీరథ, సాగునీటి పారుదల శాఖఅధికారులను ఆదేశించారు.

9న నియామక ఉత్తర్వులు

కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయులకు ఈనెల 9న నియామక ఉత్తర్వులు హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో సీఎం చేతుల మీదుగా అందజేయనున్నట్లు కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. జిల్లాలో ఎంపికైన 243మంది బుధవారం ఉదయం 8గంటల వరకు జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాల వద్ద రిపోర్ట్ చేయాలన్నారు. మొత్తం 6 బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశాల్లో జిల్లా అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మోహన్‌రావు, అదనపు ఎస్పీ రాములు, డీఆర్వో రవికుమార్, జెడ్పీ సీఈవో వెంకట్‌రెడ్డి, డీఆర్డీఏ నర్సింహులు, డీఈవో రవీందర్, డీఎంహెచ్‌వో పద్మ, ఆర్డీవో నవీన్ తదితరులు పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ ప్రారంభం

ఫ్యామిలీ డిజిటల్ కార్డ్ పైలట్ ప్రాజెక్టు సర్వే డేటా ఎంట్రీ సోమవారం కలెక్టరేట్‌లో ప్రారంభించారు. కలెక్టర్ విజయేందిరబోయి, అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్‌తో కలిసి పరిశీలించారు. తప్పొప్పులు లేకుండా డేటా ఎంట్రీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈ-డిస్ట్రిక్ట్ మేనేజరు చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిపై చాటింపు చేయాలి

హన్వాడ, అక్టోబర్ 7: ప్రతి సోమవారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిపై ప్రతి గ్రామంలో చాటింపు చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి అధికారులకు ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో తాసీల్దార్ కిష్ట్యానాయక్, ఏసీఎం సుదర్శన్, మిషన్ భగీరథ ఏఈ యాదయ్య, ఎక్సైజ్ ఎస్సై కరుణకుమారి, ఏవో కిరణ్‌కుమార్, ఎంఈవో గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

'ప్రజావాణి'ని సద్వినియోగం చేసుకోవాలి

నవాబ్‌పేట, అక్టోబర్ 7: ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం మండల కేంద్రాల్లో చేపడుతున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తాసీల్దార్ శ్రీనివాస్ కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం చేపట్టిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా తాసీల్దార్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు సంబంధించిన 4 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని త్వరలోనే పరిష్కరించేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో జయరామ్‌నాయక్, ఎంఈవో నాగ్యానాయక్, ఎంపీవో భద్రునాయక్, వెలుగు ఏపీఎం జీవరత్నం, ఏపీవో జ్యోతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పండగ పూట పస్తులుండాలా?

పండుగ పూట పంచాయతీ సిబ్బంది పస్తులుండాలా.? తక్షణమే బకాయి వేతనాలు చెల్లించాలి. మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలి. వేతనాలు పెంచాలి. గ్రామాల్లో విలేజ్ వాటర్ అసిస్టెంట్లుగా నియమిస్తున్న పంచాయతీ సిబ్బంది సీనియారిటీని గుర్తించి వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలి.

– తెలంగాణ జీపీ ఎంప్లాయిస్, వర్కర్స్

ప్రాన్ అకౌంట్లలో డబ్బులు జమ కావడం లేదు

జిల్లావ్యాప్తంగా సీపీఎస్ ఉద్యోగులకు సంబంధించి డెడక్షన్ అమౌంట్ ప్రాన్ అకౌంట్‌లో జమ కావడం లేదు. దీంతో ఈ ఏడాది మార్చి 30 నుంచి రిటైర్మెంట్ అయిన సీపీఏ ఉద్యోగ, ఉపాధ్యాయులకు వచ్చే అరకొర పింఛను కూడా పొందలేక పోతున్నారు. పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-2గా ఈ ఏడాది జూన్ 30న పదవీ విరమణ పొందిన వెంకటయ్యకు ఇప్పటి వరకు ఎలాంటి పింఛను లేదు. ఆయన కుటుంబ పోషణ భారంగా మారింది. కనీస పింఛను పొందలేని దుర్భర దుస్థితిలో ఉన్న సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు తీర్చాలి.

– బాలస్వామి, చంద్రకాంత్, టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు

మాకు న్యాయం చేయాలి

పేర్లు కలిసి రావడంతో 19 ఎకరాలకు పైగా ఉన్న నీరటి ఇనాం భూములను తమ పేరిట రికార్డుల్లోకి ఎక్కించుకున్నారు. మొత్తం 150కి పైగా సభ్యులు ఉన్న 28 కుటుంబాలకు దొంగ పట్టాతో ఎగనామం పెట్టాలని చూస్తున్నారు. తాతలు, తండ్రులు, కొడుకులు, కోడళ్లకు తెలియకుండా అక్రమంగా పట్టా చేసుకోవడంతో మాకు అన్యాయం జరుగుతుంది. నీరటి ఇనాం భూములపై 1981నుంచి ఇప్పటి వరకు పహానీలు ఉండి కాస్తులో మేమంతా ఉండగానే ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్నారు. మాకు న్యాయం చేయాలి.

– దమాయపల్లి గ్రామస్తులు, కోయిలకొండ మండలం

ప్రభుత్వ భూమిని కాపాడాలి

మహబూబ్‌నగర్ క్రిస్టియన్‌పల్లి శివారులోని సర్వే నెం.439లో ప్రభుత్వ భూమిని కొందరు అక్రమంగా కబ్జా చేయాలనే దురాలోచనతో చదును చేస్తున్నారు. ఈ భూమిని పాతపాలమూరు ప్రజలు తాత ముత్తాతల కాలం నుంచి స్మశానవాటికగా వాడుకుంటున్నారు. అక్రమంగా చదును చేస్తున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుని సర్వే నెంబర్‌లోని మొత్తం భూమికి హద్దులు చూపి ప్రహరీ ఏర్పాటు చేయాలి.

– పాతపాలమూరు దళితవాడవాసులు

వరద బాధితులకు విరాళం

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, అక్టోబర్ 7: వరద బాధితుల సహాయార్థం రూ.50వేల చెక్కును సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులు కలెక్టర్ విజయేందిర బోయికి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో నిరాశ్రయులైన బాధితుల సహాయార్థం తమ ఫోరం సభ్యులతో కలిసి విరాళాలు సేకరించామని తెలిపారు. అపత్కాలంలో సమాజానికి తమవంతుగా ఏదైనా సేవ చేయాలనే తలంపుతో ఫోరం ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నాగభూషణం, నారాయణరావు, రాజసింహుడు, సురేశ్‌బాబు, బాలయ్య, బాలకృష్ణ, మల్లికార్జున్ పాల్గొన్నారు.

అంత్యక్రియలకు మాజీ ఎమ్మెల్యే హాజరు

అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

మహమ్మదాబాద్, అక్టోబర్ 7: గండీడ్ సీనియర్ రిపోర్టర్ చెన్నారెడ్డి తల్లి ఆదివారం అర్ధరాత్రి అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి బాధితుడి ఇంటికెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీలు శ్రీనివాస్‌రెడ్డి, రాందాస్, నాయకులు గోపాల్‌రెడ్డి, రాజు, గోపాల్, ఈశ్వరయ్యగౌడ్, రాంచంద్రారెడ్డి, బాలవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి


నాగరాజు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి

మక్తల్, అక్టోబర్ 7: క్షణికావేశంలో పురుగుల మందు తాగి వ్యక్తి మృతి చెందిన ఘటన మక్తల్ మండలం కర్నిలో చోటుచేసుకున్నది. సోమవారం మక్తల్ ఎస్సై భాగ్యలక్ష్మీరెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని ఖానాపురం గ్రామానికి చెందిన నాగరాజు (22) ఆరు నెలల కిందట కర్నికి చెందిన అరక జ్యోతిని వివాహం చేసుకొని ఇళ్లరికం వెళ్లాడు. వ్యవసాయ పనుల్లో కుటుంబ సభ్యులతో చిన్నపాటి వాగ్వాదం చోటుచేసుకున్నది. మనస్తాపానికి గురై మిద్దెపై ఉన్న పురుగుల మందు తాగి కిందపడ్డాడు. గమనించిన భార్య విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలపడంతో మక్తల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం జిల్లా దవాఖానకు తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి అన్న నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. విషయం తెలిసిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి జిల్లా దవాఖానలో మృతదేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి కారణాలు తెలుసుకొని చర్యలు చేపట్టాలని పోలీసులకు సూచించినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

భూ తగాదాలను కోర్టులో పరిష్కరించుకోవాలి

నారాయణపేట, అక్టోబర్ 7 : భూ తగాదాలను కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని ఎస్పీ యోగేశ్‌గౌతమ్ తెలిపారు. సోమవారం పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 7మంది బాధితులు ఫిర్యాదులు చేయగా వాటిని నేరుగా స్వీకరించిన ఎస్పీ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ భూమికి సంబంధించిన సమస్యలు ఉంటే ఎలాంటి ఆవేశాలకు లోనుకాకుండా సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవాలని లేదా కోర్టులో పరిష్కరించుకోవాలని సూచించారు. బాధితుల ఫిర్యాదులు పెండింగ్‌లో ఉంచకుండా చట్ట ప్రకారం పరిశీలించి పరిష్కరించాలని ఫోన్‌లో సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు.

ఎస్పీని కలిసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్..

పేట జిల్లా అసిస్టెంట్ సెషన్ కోర్టుకు నూతనంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వచ్చిన మేనుశ్రీ సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ యోగేశ్‌గౌతమ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు.

ఎస్పీకి పూలమొక్క అందజేస్తున్న మేనుశ్రీ

ఫార్మసీ, పరిశోధన విద్యార్థులకు ఉపయుక్తం

● పీయూ 'ఫార్మాస్యూటికల్ మార్కెటింగ్ మేనేజ్‌మెంట్' పుస్తకావిష్కరణ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబర్ 7: సాంకేతికతను జోడిస్తూ వ్యవస్థీకృత సమగ్ర సమాచార వ్యవస్థగా ఫార్మా, ఎంబీఏ, బీ-ఫార్మసీ, ఫార్మాస్యూటికల్ మార్కెటింగ్ రంగ నిపుణులకు ఉపయుక్తంగా ఉండేలా పుస్తకాన్ని పీయూ అధ్యాపకులు రచించడం అభినందనీయమని ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డా.మధుసూదన్‌రెడ్డి అన్నారు. పీయూ ఫార్మసీ కళాశాల విభాగాధిపతి డా.వీరారెడ్డి ప్రభాకర్‌రెడ్డి, అధ్యాపకులు డా.పంగసైలాస్, డా.పంగ శ్యామ్ రచించిన 'ఫార్మాస్యూటికల్ మార్కెటింగ్ మేనేజ్‌మెంట్' పుస్తకాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ మాట్లాడారు. పుస్తకంలో పరిశోధన భావనలు, ఆచరణాత్మక చికిత్స సాధనాలుగా ఆరోగ్య సంరక్షణ వ్యవస్థకు ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. వైద్యపర మైన అంశాలతోపాటు చట్టాలు, నిబంధనలు ఔషధాల ఆవిష్కరణలో ఫార్మసీ నిపుణులు, విద్యార్థులకు కీలకంగా ఉపయోగపడుతుందన్నారు. పుస్తక రచయితల విషయ పరిజ్ఞానానికి ఈ పుస్తకం ఒక ఉదాహరణ అని ఫార్మసీ అధ్యాపకుల కృషిని అభినందించారు. కార్యక్రమంలో సీవోఈ డా.రాజ్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ కుమారస్వామి, మైక్రోబయాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కిశోర్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఎస్ఎన్.అర్జున్‌కుమార్, ఎకనామిక్స్ విభాగాధిపతి జిమ్మి కార్టన్, ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ శ్రీధర్‌రెడ్డి, ఫార్మసీ అధ్యాపకులు పాల్గొన్నారు.

పుస్తకాని ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి రిజిస్ట్రార్, పీయూ అధ్యాపకులు

పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ దాడులను ఆపాలి

నారాయణపేట, అక్టోబర్ 7 : పాలస్తీనా దేశం, ప్రజలపై ఇజ్రాయిల్ చేస్తున్న సామ్రాజ్యవాద దురాక్రమణను వెంటనే ఆపాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్రాం మిరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి కొండన్న డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామ్రాజ్యవాద అమెరికా ప్రోద్బలంతో ఇజ్రాయిల్ పాలస్తీనాపై దురాక్రమణ దాడి మొదలు పెట్టి నేటికీ ఏడాది పూర్తయిందన్నారు. ఈ ఏడాది కాలంలో అమాయక పసిపిల్లలు, మహిళలు, వృద్ధులు, పౌరులు వేలమంది మరణించడం జరిగిందన్నారు. ఈ ఆధునిక కాలంలో దురాక్రమణ పేరుతో ప్రజలను చంపడం సమంజసం కాదని, ఐక్యరాజ్యసమితి నిబంధనలు తుంగలో తొక్కి దాడులు చేయడం సహించరానిదన్నారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్-మాస్ లైన్) జిల్లా నాయకులు ప్రశాంత్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు గోపాల్, రైతు సంఘం జిల్లా నాయకులు అంజిలయ్య గౌడ్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ రేషన్ కార్డు ఇవ్వాలి

హన్వాడ, అక్టోబర్ 7: ప్రతిఒక్క కుటుంబానికి రేషన్ కార్డును అందజేసి 16రకాల సరుకులను ప్రభుత్వం అందజేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని సీపీఎం మహాసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం దేశంలోని 10 బడా కంపెనీలకు కోట్ల సంపదను సమకూర్చిందన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 78ఏండ్లు గడుస్తున్నా నేటికి పూర్తిస్థాయిలో విద్య అందించలేదన్నారు. ప్రజలు గ్రామాల్లో ఎందుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు. ప్రభుత్వం ప్రతి ఒక్క రైతు రుణమాఫీ చేయాలన్నారు. ఉపాధి హామీ పని దినాలను 600రోజులకు పెంచాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి లక్ష్మయ్య, నాయకులు రాములు, రాఖమయ్య, చిన్నయ్య, శ్రీకాంత్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణపేటలో మాట్లాడుతున్న వెంకట్రామిరెడ్డి

మత్స్యకారుల అభివృద్ధే లక్ష్యం

● నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్లతో ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

నారాయణపేట టౌన్, అక్టోబర్ 7 : మత్స్యకారులను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అన్నారు. సోమవారం పట్టణ శివారులోని కొండారెడ్డిపల్లి చెరువులో 82,500 చేప పిల్లలను కలెక్టర్ సిక్తాపట్నాయక్‌తో కలిసి చెరువులో వదిలారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 100శాతం సబ్సిడీతో చేప పిల్లలను చెరువులో వదలడం వలన మత్స్యకారులకు, ముదిరాజులకు ఆర్థికంగా ఎదిగేందుకు వీలు కలుగుతుందన్నారు. కలెక్టర్ సిక్తాపట్నాయక్ మాట్లాడుతూ మత్స్యకారులకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి వెంకయ్య, మత్స్యసహకార సంఘం అధ్య